# కల్లాల్లో కన్నీరు

అకాల వర్షంతో రైతు ఆగమాగం!

ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం

కల్లాల్లో తడిసి ముద్దయిన వరి, మొక్కజొన్న

నిండా మునిగిన రైతు..



ప్రజాజ్యోతి

శుక్రవారం 08 మే 2026


10 పేజీలు

కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

# కరీంనగర్‌లో హైటెన్షన్

## బీజేపీ – బీఆర్ఎస్ ఘర్షణలతో నగరం ఉద్రిక్తం



వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి

బీజేపీ శ్రేణుల ఆగ్రహం.. గంగుల క్యాంప్ ఆఫీస్ ముట్టడి

కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బిజెపి నాయకులు

బి జె పి ఆఫీస్ ను ప్రతి దాడిని యత్నించిన బి ఆర్ ఎస్ నాయకులు

ఇరువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



రాజకీయం ఒక్కసారిగా సెగలు పుట్టిస్తోంది. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసు వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మీడియా సమావేశంలో బండి సంజయ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు. బండి సంజయ్‌కు డ్రగ్స్ అలవాటు ఉందని, తంబాకులో డ్రగ్స్ కలిపి తీసుకోవడం వల్లే ఆయనకు బట్టతల వచ్చిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, డ్రగ్స్ టెస్టుకు తాము సిద్ధమని, బండి సంజయ్ కూడా రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల ఖర్చు కోసం గతంలో భార్య పుస్తెలు అమ్మినట్లు చెప్పిన సంజయ్, ఇప్పుడు వేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తున్నారని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలతో ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసును ముట్టడించారు.



# కరీంనగర్‌లో హైటెన్షన్

- బీజేపీ – బీఆర్ఎస్ ఘర్షణలతో నగరం ఉద్రిక్తం
- వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి
- బీజేపీ శ్రేణుల ఆగ్రహం.. గంగుల క్యాంప్ ఆఫీస్ ముట్టడి
- కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బిజెపి నాయకులు
- బి జె పి ఆఫీస్ ను ప్రతి దాడిని యత్నించిన బి ఆర్ ఎస్ నాయకులు
- ఇరువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**కరీంనగర్ బ్యూరో, మే 7 (ప్రజాజ్యోతి )**

బండి సంజయ్ కుమార్ పై పాడి కౌశిక్ రెడ్డి చేసిన తీవ్ర వ్యాఖ్యలతో కరీంనగర్ రాజకీయాలు ఒక్కసారిగా మంటలు రేపాయి. పరస్పర ఆరోపణలు, నిరసనలు, దాడులు, రాళ్లదాడులు, లాఠీచార్జ్‌లతో నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు రోడ్లపైకి రావడంతో కరీంనగర్ ప్రధాన వీధులు యుద్ధ వాతావరణాన్ని తలపించాయి.

**కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో మొదలైన వివాదం**

కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. బండి సంజయ్‌కు డ్రగ్స్ అలవాటు ఉందని, తంబాకులో డ్రగ్స్ కలిపి తీసుకోవడం వల్లే ఆయనకు బట్టతల వచ్చిందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నోటికొచ్చినట్లు మాట్లాడటం తమకూ వస్తుందని, కేటీఆర్‌పై విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.అదేవిధంగా డ్రగ్స్ పరీక్షలకు తాము సిద్ధమని, కేటీఆర్‌ను తీసుకొస్తానని, బండి సంజయ్ కూడా పరీక్షలకు రావాలని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి.

**బీజేపీ శ్రేణుల ఆగ్రహం.. గంగుల క్యాంప్ ఆఫీస్ ముట్టడి**

కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు భారీగా గుమిగూడి గంగుల కుమార్ అధికారిక క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. "బండి సంజయ్‌కు క్షమాపణ చెప్పాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయం వద్ద ఉద్రిక్తతలు నెలకొనగా, అక్కడికి మీడియా సమావేశానికి వచ్చిన కౌశిక్ రెడ్డి వాహనంపై కొందరు బీజేపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దాడిలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. క్యాంప్ కార్యాలయంలోని ఫర్నిచర్ కూడా ధ్వంసమైనట్లు సమాచారం.

**"నాపై హత్యాయత్నం చేశారు" ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపణ**

ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, తనపై పక్కా ప్రణాళికతో హత్యాయత్నం జరిగిందని తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ నాయకత్వం ప్రేరేపణతోనే దాడి జరిగిందని విమర్శించారు. తనను భయపెట్టే ప్రయత్నాలు చేస్తే వెనక్కి తగ్గేది లేదని ప్రకటించారు.

**పోలీసులు రంగంలోకి.. లాఠీచార్జ్**

పరిస్థితి అదుపుతప్పుతుండటంతో పోలీసులు భారీగా మోహరించారు. బీజేపీ కార్యకర్తలను అడ్డుకునే క్రమంలో పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది. తోపులాటలో పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. నగరంలోని కీలక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు మోహరించి నిఘా పెంచారు.

**బి జె పి దాడి తో బీఆర్ఎస్ శ్రేణుల ప్రతిదాడి కి పిలుపు**


తమ క్యాంప్ కార్యాలయంపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు కూడా పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చాయి. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిలుపుతో వందలాది మంది కార్యకర్తలు కరీంనగర్ బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. "బండి సంజయ్ డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ బారికేడ్లను దాటేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరు పార్టీల కార్యకర్తల మధ్య రాళ్లదాడులు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు మరోసారి లాఠీచార్జ్ చేశారు.

**నగరంలో ఉద్రిక్త వాతావరణం**

ఘర్షణల నేపథ్యంలో కరీంనగర్ నగరంలో వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ముఖ్య కూడళ్ల వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీపీ గౌస్ ఆలం పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు.

**రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం**

కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం ఇప్పుడు వీధి ఘర్షణలకు దారితీయడంతో కరీంనగర్ రాజకీయాలు హైటెన్షన్‌గా మారాయి. ఇరు పార్టీల శ్రేణులు పరస్పరం ఎదురెదురుగా నిలవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజలు మాత్రం నగరంలో నెలకొన్న ఉద్రిక్తతలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





**ఎం.ఎల్.ఏ గంగుల క్యాంప్ ఆఫీస్ పై బీజేపీ దాడిని ఖండించిన సి పి ఐ**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో కరీంనగర్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై బిజెపి నాయకులు కర్రలతో దాడి చేయడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు ఎంపీ బండి సంజయ్ పై చేసిన విమర్శలపై బీజేపీ నాయకులు ప్రతి విమర్శ చేయకుండా,వారికి సమాధానం చెప్పలేక సహనం కోల్పోయి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై,గంగుల కమలాకర్ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంపై బిజెపి నాయకులు కర్రలతో దాడి చేయడం హేయమైన చర్య అని, ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం సిగ్గుచేటని,బాధ్యత గల ఎంపీ,కేంద్రమంత్రి బండి సంజయ్ తనను విమర్శిస్తే దాడులు చేయాలని వారి కార్యకర్తలకు ఏమైనా శిక్షణ ఇస్తున్నారా అనేది అనుమానంగా ఉందని, ప్రశాంతంగా ఉన్న కరీంనగర్ ను దాడులతో అల్లర్లు లేపి శాంతియుత వాతావరణం లేకుండా చేయాలనే కుట్ర చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.దాడి జరిగింది బిఆర్ఎస్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అని చూడకుండా ఆ క్యాంప్ కార్యాలయం ప్రభుత్వ కార్యాలయమని చూడకుండా దాడికి పాల్పడ్డారు.దాడి చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, పోలీస్ అధికారులు దాడి చేసిన వారిని గుర్తించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



# కల్లాల్లో కన్నీరు

- అకాల వర్షంతో రైతు ఆగమాగం!
- ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం
- కల్లాల్లో తడిసి ముద్దయిన వరి, మొక్కజొన్న
- నిండా మునిగిన రైతు..

**జగిత్యాలప్రతినిధి,మే7( ప్రజాజ్యోతి):**

పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం అన్నదాతను నిలువునా ముంచింది. గురువారం జిల్లావ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకుందామని కల్లాలకు చేర్చిన రైతులకు, ప్రకృతి కన్నెర్ర చేయడంతో తీరని నష్టం వాటిల్లింది. ఈదురు గాలుల ధాటికి వరి, మొక్కజొన్న పంటలు నేలకొరగడమే కాకుండా, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది.జిల్లాలోని మార్కెట్ యార్డు తో పాటు, పలు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కుప్పలపై వర్షపు నీరు ప్రవహించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మొక్క జొన్న రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.నీటిలో ఉన్న ధాన్యం చూసి రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. తార్పాలిన్ కవర్లు చాలక, వర్షం ,ఈదురు గాలి ధాటికి అవి ఎగిరిపోవడంతో పంటను కాపాడుకోలేకపోయామని వాపోతున్నారు. అకాల వర్షం వల్ల దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. తడిసిన ప్రతి గింజను ఏ విధమైన కోత లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అప్పులు చేసి పండించిన పంట కళ్లముందే నీటిపాలవడంతో ప్రభుత్వం ఇచ్చే భరోసా కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.







# పేరుకే కొనుగోలు కేంద్రాలా! - ధాన్యం కొనుగోలు చేసేదెప్పుడు


- ఫోటోలకు ఫోజులు తప్ప రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్న బీజేపీ దళిత్ మోర్చా నాయకులు హరీష్

**ఇల్లంతకుంట మే 7(ప్రజాజ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు పేరుకే ప్రారంభించారని, ఇప్పటికీ వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదని బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్ మండిపడ్డారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి దాదాపు 15 నుండి 20 రోజులు గడిచినా ఇప్పటికీ రైతుల వడ్లకు తూకం వేయడం లేదన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప రైతులకు ఉపయోగపడే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలుగా ఉన్న వడ్ల రాశులు అకాల వర్షాలకు తడిసి రైతులకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి.

**వేములవాడ,మే,7:ప్రజాజ్యోతి.**



ఆసియా ఖండంలో మొట్ట మొద టి నోబెల్ ప్రైజ్ గ్రహీత విశ్వకవి జనగణమన రచయిత రవీంద్ర నాథ్ ఠాగూర్ జయంతి. ఆయన ఏడవ తేదీ మే నెల 1861 లో కొల కత్తాలోని ప్రసిద్ధ కుటుంబంలో దేవేంద్రనాథ్ ఠాగూర్ శారదా దేవిలకు జన్మించారు చిన్నతనం నుంచే ప్రకృతిని ప్రేమిస్తూ ఎనిమిది సంవత్సరాల వయసులో నే పద్యాలు రాయడం ప్రారంభించారు కవిత్వం చిన్న కథలు నవలలు నాటకాలు పెయింటింగ్స్ లలో అద్భుత ప్రతిభ కనబరిచారు ఆయన రాసిన ది కాబూలీవాలా ది పోస్ట్ మాస్టర్ గోరే ఘైరే కథలు ఎంతో ప్రసిద్ధి చెందాయి బెంగాల్లో రచయితలలో అగ్రగణ్యుడిగా పేరు సంపాదించినారు 1913లో గీతాంజలి కవిత సంపుటికి నోబెల్ బహుమతి లభించింది జలియన్వాలాబాగ్ దురాగతానికి నిరసనగా బ్రిటిష్ వారు ఇచ్చిన నైట్ హుడ్ బిరుదును తిరస్కరించారు విశ్వ భారతి శాంతి నికేతన్ విద్యాలయం స్థాపించి ఆధునిక విద్యను కలలను నిలువించి విద్యాలయాలు నెలకొల్పారు పకృతి ప్రేమికుడిగా మానవతవాదిగా కళాకారుడిగా ఆయన రచనలు ఎప్పటికీ నిలిచిపోతాయి ఆయన 7 ఆగస్టు 1941 రోజున మరణించారు అతనికి స్వతంత్ర సమరయోధులు అయినా తనకు భారతజాతి ప్రగాఢ నివాళులు అర్పిస్తుంది జనగణమన అనే గేయం ద్వారా భారతజాతిని మేల్కొల్పారు

# గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**ఇల్లంతకుంట మే 7(ప్రజాజ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం స్థానిక సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవి కాలం మండుతున్న ఎండల దృష్ట్యా గ్రామ పంచాయతీ కి వచ్చే ప్రజలకు, అధికారులకు,బాటసారులకు దాహార్తి ని తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు.



## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ నగేష్

**గంగాధర మే 07: (ప్రజా జ్యోతి):**



మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో ఉపాధి హామీ కూలీలు 108 మందికి సర్పంచ్ ముద్దం నగేష్ ప్రతి రోజూ తన సొంత ఖర్చుతో మజ్జిగ,మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యం లో కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండటానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు నగేష్ తెలిపారు. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కూలీలకు సూచించారు.

# కటాంపల్లి లో చలివేంద్రం ఏర్పాటు.

**వేములవాడ,మే,7:ప్రజాజ్యోతి.**



వేములవాడ రూలర్ మండలం వెంకటంపల్లి గ్రామంలో ఎండలు తీవ్రత పెరుగుతున్న సందర్భంగా గ్రామ ప్రజలకు రైతులకు అండ గా ఉండే ఉద్దేశంతో ఈరోజు వెంకటంపల్లి సర్పంచ్ పాలకవర్గం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవునూరి లక్ష్మీ చిన్ననరసయ్య ఉపసర్పంచ్ వెలిచాల మల్లేశం, వార్డు సభ్యులు బండ బాబు ఆవునూరి లక్ష్మి పసునూరి స్వ రూప మారా అనిల్ నార్రెడ్డి ద యాసాగర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బండ శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

## బి టి అర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**ఇల్లంతాకుంట మే 7(ప్రజాజ్యోతి)**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండల కేంద్రంలో. బి టి అర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణి చేస్తున్న బెంద్రం తిరుపతి రెడ్డి ఇల్లంతకుంట మండలనికి వచ్చే వేలాది మంది ప్రజలకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించేందుకు చల్లని ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న బెంద్రం.తిరుపతి రెడ్డి మండల యువజన సంఘాల అధ్యక్షులు, ఫౌండేషన్ సేవా ప్రతినిదులు పయ్యావుల.నవీన్ గజ్జల శ్రీనివాస్ , ఇల్లెంకి శ్రీను గౌరవేణి. శ్రీనివాస్ ప్రయాణికులు పాలుగోన్నారు

## పాడి కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

- **బీజేవైఎం జిల్లా నాయకులు సంగ నరేష్**



**చొప్పదండి, మే 7 (ప్రజాజ్యోతి):**

కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై బీజేవైఎం జిల్లా నాయకులు సంగ నరేష్ తీవ్రంగా మండిపడ్డారు. చొప్పదండిలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి తన అహంకారాన్ని పక్కన పెట్టి, నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, కానీ వ్యక్తిగత దూషణలకు దిగడం కౌశిక్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ప్రజాప్రతినిధి హోదాలో ఉండి బాధ్యతాయుతంగా మాట్లాడటం నేర్చుకోవాలని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే బిజెవైయం నాయకులు , కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.కౌశిక్ రెడ్డి మాటల్లో కనీస రాజకీయ సంస్కారం లేదని, యువతకు ఆయన ఇచ్చే సందేశం ఇదేనా అని ప్రశ్నించారు.అభివృద్ధి పనుల మీద దృష్టి పెట్టకుండా, కేవలం వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో ఉండాలని ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే, జిల్లా వ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కౌశిక్ రెడ్డి పర్యటనలను అడ్డుకుంటామని, తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసిన పటేల్ సంఘము నాయకులు.

**వేములవాడ,మే,7:ప్రజాజ్యోతి.**

కేంద్ర మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ సిరిసిల్ల పర్యటనలో వేములవాడ పట్టణానికి చెందిన వేములవాడ మున్నూరు కాపు రూరల్ పటేల్ సంఘం నాయకులు సంఘ భవనం నిర్మాణం గురించి పది లక్షల రూపాయలు నిధులు ఇవ్వాలని కోరారు ఎన్నికల ముందు మీరు మాకు మాట ఇచ్చారని మాకు మూడు గంటల స్థలం ఉందని మీకు మూడు సార్లు కలిసినమని తెలియజేసినారు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ఇచ్చిన ఆరులక్షల రూపాయల నిధులతో 8 పిల్లర్లు వేసి బేసిమెట్ వరకు పూర్తయిందని మీరు 10 లక్షలు నిధులు మంజూరు చేస్తే పూర్తి అవుతుంది అని పెరుక్కొన్నారు ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి బీజేపీ రాజన్న సిరిసిల్ల ఇంచార్జి గంగాడి మోహన్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రము మహేష్ పటేల్ రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్ (కౌన్సిలర్ ) గోపు బాలరాజ్ పటేల్ బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ మాజీ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్ కౌన్సిల్లర్లు వంగల శ్రీనివాస్ బీజేపీ నాయకులు సంటి మహేష్ మామిండ్ల లక్ష్మి రాజం రేగుల శ్రీకాంత్ బిజెపి రూరల్ అధ్యక్షుడు పరమేష్ ప్రధాన కార్యదర్శి సుంకరి నరేంద్ర పటేల్ బిజెపి నాయకులు తోట శేఖర్ పటేల్ గౌతమ్ పటేల్ బీజేపీ సీనియర్ నాయకులు రాజిరెడ్డి నామాల శేఖర్ పటేల్ పటేల్ సంఘం అధ్యక్షులు సారా శ్రీనివాస్ పటేల్ ప్రధాన కార్యదర్శి చెక్క దేవయ్య పటేల్ ఉపాధ్యక్షులు గోలి తిరుపతి పటేల్ పటేల్ సంగం ఎన్నికల కార్య నిర్వహణ అధికారి బొప్ప బిక్షపతి పటేల్ తదితరులు పాల్గొన్నారు



# అర్హులందరికీ త్వరలో ఉపకరణాలు అందిస్తాం

- **ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు త్వరలో సైకిల్ పంపిణీ చేస్తాం**
- **దివ్యాంగులకు సేవలందిస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**
- **ఐఓసీఎల్ సీఎస్ఆర్ కింద జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ.83 లక్షల విలువైన 813 ఉపకరణాల పంపిణీ**
- **హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి మే -07 (ప్రజాజ్యోతి)**

దివ్యాంగులకు అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భరోసా ఇచ్చారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద దివ్యాంగులకు రూ. 83 లక్షల విలువైన 813 ఉపకరణాలు అందించగా, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని సినారే కళామందిరంలో గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్, ఇతర పరికరాలు అందజేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని, దివ్యాంగుల కోసం రూ. 1600 కోట్లు వెచ్చిందని తెలిపారు. దివ్యాంగులకు ఇప్పటికే సహాయ పరికరాలు ఇచ్చామని, భవిష్యత్తులో అర్హులందరికీ ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఎంతో మంది దివ్యాంగులు ఆత్మ స్థైర్యం, మనోధైర్యంతో ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు అందరూ మద్దతుగా ఉండాలని, వారిలో స్ఫూర్తి నింపాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, డ్రాప్ ఔట్ ఉండవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ మేరకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది కూడా సైకిల్ లు ఇస్తామని, ఈ ఏడాది 15 వేలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులు సంక్షేమానికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు తెలియజేశారు.

**ఉపకరణాలతో మరింత ముందుకు వెళ్లాలి**

శిబిరంలో పంపిణీ చేసే ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని మరింత ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. సుగమ్య భారత్ ... స్వశక్త భారత్ లో భాగంగా దేశ నిర్మాణం, అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు జిల్లాలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశామని, వైద్య పరీక్షలు చేయించి అర్హులను గుర్తించామని తెలిపారు. ఈ ఉప కరణాలతో దివ్యాంగులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ లో 10 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యూ డీ ఐ డీ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని, వైకల్య నిర్ధారణ పరీక్షలు ప్రతి నెలా చేయిస్తున్నామని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేములవాడలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు హెల్ప్ డెస్క్, దివ్యాంగులకు వీల్ చైర్లు, సహాయం అందించామని గుర్తు చేశారు. సిరిసిల్లలోని డే కేర్ సెంటర్ లో సేవలను దివ్యాంగులు ఉపయోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారాణి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వినీత్ కౌల్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ ఆర్ హెడ్ హైదరాబాద్ కైలాస్ కాంత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## పీఎం కుసుం పథకం ద్వారా సౌర ప్లాంట్


**చొప్పదండి, మే 7 (ప్రజాజ్యోతి):**



చొప్పదండి లో రైతు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు సౌర విద్యుత్ కేంద్రాలు అనే అంశంపై గురువారం సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏఈ చంద్రయ్య మాట్లాడుతూ పీఎం కుసుం పథకం ద్వారా రైతులు రెండు మెగావాట్స్ సామర్థ్యం కలిగిన సౌర ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చని, సహకార సంఘాలు కూడా ఈ పథకం ఏర్పాటు చేసుకోవచ్చని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి మమత వ్యవసాయ యాంత్రికరణ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత మాట్లాడుతూ వ్యవసాయ అవసరాలకు పీఎం కుసుమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్యాక్స్ చైర్మన్ మల్లారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన శాఖ, విద్యుత్ శాఖ సలహాలను సూచనలను పాటించాలని,సబ్సిడీలను వినియోగించుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో అర్నకొండ ఏఈ విద్యాసాగర్, ఉద్యానవన శాఖ అధికారి రోహిత్, హాకా మేనేజర్ కృష్ణయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్య జ్యోష్న, కవిత ,సాయి ప్రసన్న, సంపత్ ,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కొలనులో పడి యువకుడు మృతి

**గంభీరావుపేట మే 7 (ప్రజా జ్యోతి);**



గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలోని హనుమాన్ దేవాలయం ముందు ఉన్న కొలనులో హనుమాన్ దీక్ష చేస్తున్న నీ రెడీ వినయ్ వయస్సు 16 సంవత్సరాలు ముదిరాజ్ కులానికి చెందిన కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం కుకునూరు గ్రామానికి చెందిన యువకుడు సిద్దిపేటలో నీ తన అమ్మమ్మ దగ్గర ఉంటూ తోటి మిత్రలు 9 మందితో కలిసి భీమన్ మల్లారెడ్డిపేట వీరాంజనేయ టెంపుల్ కు దర్శించుకుని వచ్చి 9 మంది కొలనులో స్నానానికి వెళ్లి అతనికి ఈత రాక యువకుడు మృతి చెందాడు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ హాస్పిటల్ కి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐపి అనిల్ కుమార్ తెలిపారు.

# ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- **రూ.39 లక్షల విలువైన నూతన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తి**
- **జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి, ప్రతినిధి మే 07 ప్రజా జ్యోతి;**



పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రికి కొత్తగా వచ్చిన సుమారు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది ఓపీ రోగులు ఆసుపత్రికి వస్తున్నందున వారికి అవసరమైన అన్ని సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి మందుల లభ్యతపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్లిట్ ల్యాంప్, 90డి లెన్స్, సిఆర్మ్ మిషన్, యూరాలజీ పరికరాలు, స్పిరోమీటర్, ఆడియోమీటర్, ఫైబర్ ఆప్టిక్ లారింగోస్కోప్, డెర్మా చెయిర్, అల్ట్రాసౌండ్ మిషన్, హీటింగ్ ప్యాడ్, చెస్ట్ వైబ్రేటర్, రూట్ కెనాల్ చికిత్సకు అవసరమైన ఎండోమోటర్, మైక్రోమోటర్ హ్యాండ్ పీస్ తదితర ఆధునిక పరికరాల వినియోగంపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్, వైద్యులు, తదితరులు, పాల్గొన్నారు.

## దేవాలయాల్లో వరుస దొంగతనాలపై చర్యలు తీసుకోవాలి.

- **ధర్మారం ఎస్సైకు శ్రీరామ్ హనుమాన్ సేన ఫిర్యాదు**

**ధర్మారం,మే7(ప్రజాజ్యోతి న్యూస్):**

ధర్మారం మండలంలోని పలు దేవాలయాల్లో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలు,దాడులపై వెంటనే చర్యలు తీసుకోవాలని శ్రీరామ్ హనుమాన్ సేన పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మందపల్లి గంగరాజు ధర్మారం సబ్ ఇన్స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్తిపాక గ్రామంలో ఇటీవల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అభరణాలు దోచుకెళ్లిన దొంగలను కూడా తొందరగా చేదించి పట్టుకోవాలని పోలీసులను కోరారు.ధర్మారంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో జరిగిన దొంగతనం భక్తుల్లో ఆందోళన కలిగించిందన్నారు. వరుసగా దేవాలయాలపై దాడులు జరుగుతుండటంతో హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దేవాలయాల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టి, దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను కోరారు. మండలంలోని అన్ని దేవాలయాలకు తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## బొమ్మారెడ్డిపల్లి 72 ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలోకి

- **అక్రమ పట్టాలు రద్దు చేస్తూ కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశాలు**
- **ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన తహసిల్దార్ శ్రీనివాస్**


**ధర్మారం,మే7(ప్రజాజ్యోతి న్యూస్):**

ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 679/4,679/5,679/6, 679/7లో ఉన్న 72.03 ఎకరాల ప్రభుత్వ భూమిపై నమోదైన అక్రమ పట్టాలను రద్దు చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రొసీడింగ్స్ నం. E3/434/2026, తేదీ 27042026న ఉత్తర్వులు జారీ చేశారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు బొమ్మరెడ్డిపల్లి రెవెన్యూ శివారులోని ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకొని ప్రభుత్వ భూమిలో తహసిల్దార్ దురిశెట్టి శ్రీనివాస్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే,రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఈ భూములపై జరిగిన అక్రమ లావాదేవీలపై విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.రెవెన్యూ శాఖ మంత్రి సమీక్ష సమావేశంలో కూడా ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరపాలని ఆదేశాలు రావడంతో పెద్దపల్లి ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారు. విచారణ పూర్తయ్యే వరకు భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు,ప్లాట్ల లావాదేవీలను నిలిపివేయాలని ధర్మారం తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.విచారణలో బొమ్మారెడ్డిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 679లో మొత్తం 670.22 ఎకరాలు "సర్కారీ పరంపోగు"గా సెత్వార్ రికార్డుల్లో నమోదై ఉన్నట్లు తేలింది.1349 ఫసలీ కాలంలో దేవి పెద్దా లచీగ అనే నీరడికి కేవలం సాగు చేసుకునేందుకు మాత్రమే తాత్కాలిక అనుమతి ఇచ్చినట్లు తహసీల్ కార్యాలయ రికార్డులు వెల్లడించాయి.అయితే భూమిపై ఎటువంటి యాజమాన్య హక్కులు లేదా పట్టా హక్కులు కల్పించలేదని స్పష్టం అయింది. తదుపరి కాలంలో నీరడి వారసుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయబడినప్పటికీ, భూమి అసలు సాగులో లేదని,పెద్ద రాళ్లు,చిన్న కొండలు ,పొదలతో నిండి ఉండి సాగుకు అనువుగా లేదని పాత తహసీల్దార్ నివేదికలు వెల్లడించాయి.2012 మరియు 2025లో నిర్వహించిన క్షేత్రస్థాయి తనిఖీల్లో కూడా ఎక్కువ భాగం భూమి బీడుగానే ఉన్నట్లు తేలింది.ఈ నేపథ్యంలో భూమిపై నమోదైన అక్రమ పట్టాలు, రికార్డు ఎంట్రీలను రద్దు చేసి, సర్వే నంబర్ 679లోని 72.03 ఎకరాలను ప్రభుత్వ భూమిగా తిరిగి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల్లో "సర్కారీ పరంపోగు"గా నమోదు చేయడంతో పాటు భూభారతి పోర్టల్‌లో "నోషనల్ ఖాతా"లో చేర్చాలని పెద్దపల్లి ఆర్డీవో, ధర్మారం తహసీల్దార్‌లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



## అల్లూరి సీతారామరాజు వర్ధంతి.

**వేములవాడ,మే,7:ప్రజాజ్యోతి.**




భారత స్వతంత్ర చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి ఇతడు జరిపిన సాయుధ పోరాటం స్వతంత్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి దాని కొరకు 27 ఏళ్ల వయసులోనే తన ప్రాణాలర్పించిన యోధుడు 19 24 మే 7వ తేదీన ఆయన మరణించిన రోజును మనం వర్ధంతిగా జరుపుకుంటున్నాము జులై 4వ 1897తారీఖురోజున అల్లూరి సీతారామరాజు జన్మించారు బ్రిటిష్ పాలకులను ఎదిరించి సాయుధ పోరాటం చేసిన మాన్యంప్రాంత విప్లవ వీరుడు గేరిల్ల యుద్ధ తంత్రంలో అసమానసురుడుదేశభక్తి నరానరాల్లో నింపుకొని అంగ్లేయుల మీద తిరుగుబాటు కొరకు ఒక సైన్యం అవసరంఅని అమాయకులు అయినా మాన్యం ప్రాంతంలోని నిరక్షరాస్యులు నిరుపేదలు అమాయకులు అయిన వారిని మహా నాయకులుగా స్వతంత్ర సమరంలో ఒక వీరులుగా తయారుచేసి వారికి దేశభక్తి నూరు పోసి యుద్ధ తంత్రంలో మెలుకువలు నేర్పి బ్రిటిష్ వారిమీద గేరిల్లా దాడులు చేయుచు వారివాద్దనుండి ఆయుధాల ను కొల్లాగొట్టి బ్రిటిష్ వారిని ముప్పు తిప్పలు పెట్టాడు బ్రిటిష్ కలెక్టర్ భారస్టియన్ చర్చలకు పిలిచి మోసంతో కాల్చివేశారు సీత రామరాజు మరణం తో మిగిలిన విప్లవ వీరులు ప్రాణాలకు తెగించి విధులు మించారు వారి దుస్సాహసాల వలన విపరీతంగా పరిణామాలు జరిగాయి కొందరు పోరాటంలో మరణించారు మరికొందరు పంట పడ్డారు ఎండు పడాలను మే 26న గ్రామ ప్రజలు పట్టుకొని సంపివేశారు సంకోజముకానికి 12 సంవత్సరాల జైలు శిక్ష వేశారు గంట దొర భార్యను భార్యను కూతుర్ని బంధించి పందికొంటు కోన దగ్గర చాలా బీకర పోరు జరిగిన తర్వాత గంట దొరను సైనికులను సహచరులను హతమార్చినది దీంతో మన్యం విప్లవం సద్దుమనిగినది సీతారామరాజు ఒక ఉజ్వల కాంతి కెరటం అతని బాటలోనే ఆయనఅనుచరులు వీరమరణం పొందారు ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి మన్యం ప్రాంతంలో ఒక వెలుగు వెలిగి స్వతంత్ర సమరానికి నాంది పలికిన ఆ మహనీయునికి మనము ప్రగాఢ నివాళులు వర్ధంతి సందర్భంగా అర్పిద్దాం

## మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన ఉద్యమకారులు

**వేములవాడ,మే,7:ప్రజాజ్యోతి.**



హైదరాబాదులోని మినిస్టర్ క్యాంపస్ నందు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేయడం జరిగింది. అనంతరము యెల్ల పోశెట్టి జన్మదిన అభినందన సంచిక తో పాటు స్వామివారి కండువాతో మంత్రిసత్కరించనైనది.తదనంతరం ఎమ్మెల్సీ కోదండరాం ని సత్కారించారు. మాధాపూర్ లోని కార్యాలయం లో సాంస్కృతి సారథి చైర్ పర్సన్ వెన్నెలక్క ను కలిసి ఘనంగా సన్మానించి స్వామీ వారి ప్రసాదం అందజేయడం జరిగింది. తదుపరి తెలంగాణ డాక్టర్ ల సంఘం E S I అధ్యక్షులు గా ఎన్నికయిన డాక్టర్ చీమ శ్రీనివాస రావు ని సన్మానించి స్వామి వారి ప్రసాదం అందజేయ ననైది.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి ఉద్యమ కారుల రాష్ట్ర సీనియర్ నాయకులు బొజ్జ కనకయ్య ఉద్యమ కళాకారుల విభాగం న్యాయ సలహాదారులు వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది నేరళ్ల తిరుమల గౌడ్ ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యమ కళాకారుల విభాగం అధ్యక్షులు వారాల దేవయ్య ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు దయానంద్.సికింద్రాబాద్ కన్వీనర్ ఆర్ కె భూపాల్. లాల దేవయ్య తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీలో ఏసీబీ సోదాలు

- **ఇంటి పర్మిషన్ కోసం రూ.5 వేల లంచం తీసుకున్నట్లు ఆరోపణ**
- **పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకున్న అధికారులు**

**పెద్దపల్లి ప్రతినిధి మే 7 ప్రజా జ్యోతి;**



పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కుమారస్వామి ఇంటి నిర్మాణ అనుమతి (హౌస్ పర్మిషన్) మంజూరు చేయడానికి ఓ వ్యక్తి నుంచి ఫోన్‌పే ద్వారా రూ.5 వేల లంచం తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కుమారస్వామిని అదుపులోకి తీసుకుని, కార్యాలయంలోని సంబంధిత రికార్డులు, ఫోన్‌పే లావాదేవీల వివరాలు, పర్మిషన్ ఫైళ్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అధికారుల విచారణలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏసీబీ బృందం సిబ్బందిని ప్రశ్నిస్తూ, గతంలో కూడా ఇలాంటి ఆరోపణలు ఉన్నాయా అనే కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇటీవల ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు పెరుగుతున్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## గంగాధర రైతు వేదికలో రైతు వారోత్సవం

- **హాజరైన జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి.**

**గంగాధర మే 07: (ప్రజా జ్యోతి):**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాల్లో నాలుగవ రోజు గంగాధర మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు పీఎం కూసుమ్ పథకం ద్వారా సోలార్ పంపు సెట్ల, సమగ్ర పోషక యాజమాన్యం, వ్యవసాయ యంత్రికరణ మెషినరీ రకాలు,సబ్సిడీ పై లభించే వ్యవసాయ పనిముట్ల వివరాలను అధికారులు రైతులకు వివరించారు. ఇతర ప్రభుత్వ సబ్సిడీలు మరియు పొందే విధానాన్ని తెలియజేశారు. వ్యవసాయ యంత్రికరణలో సబ్సిడీ లబ్ది పొందిన బెనెఫిషరీ యొక్క అనుభవన్ని తెలియజేశారు. డ్రోన్ ప్రదర్శన, సబ్సిడీ లో వచ్చిన వ్యవసాయ పనిముట్లు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర స్పెషల్ ఆఫీసర్ అబ్సర్వర్ ఈశ్వరయ్య, డిసిఓ, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, అసిస్టెంట్ డైరెక్ట్ అఫ్ అగ్రికల్చర్ ప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, , విద్యుత్ శాఖ అధికారులు,సర్పంచ్ లు, ఇతర ప్రజా ప్రతినిధులు, రైతు సోదరులు పాల్గొన్నారు.



# బండి సంజయ్‌పై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం

- **బి జె పి రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు**

**కరీంనగర్ బ్యూరో, మే 7 (ప్రజాజ్యోతి )**

కరీంనగర్‌లో ఇటీవల జరిగిన దోపిడి ఘటన విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్రంగా ఖండించారు.నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "పెళ్లికి, చావుకి ఒకే వాయిద్యం వాయిస్తున్నట్లుగా బీఆర్ఎస్ నాయకుల పరిస్థితి ఉందని" విమర్శించారు. శాంతి భద్రతల బాధ్యత ఎవరి చేతిలో ఉంటుందో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు తెలియకపోవడం సిగ్గుచేటన్నారు.ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే బాధ్యతాయుతంగా స్పందించాల్సింది పోయి, బండి సంజయ్‌పై విమర్శలు చేయడం బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు వారి సిగ్గులేని తనానికి నిదర్శనమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న నాయకుడు బండి సంజయ్ మాత్రమేనని సునీల్ రావు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రైతు భరోసా అమలులో లోపాలు వంటి అంశాలపై బండి సంజయ్ నిరంతరం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని చెప్పారు.కేటీఆర్ తరఫున కౌశిక్ రెడ్డి సవాళ్లు విసురుతున్నారని, ఏ వేదికలోనైనా చర్చకు తాము సిద్ధమని సునీల్ రావు సవాల్ విసిరారు. డ్రగ్ పరీక్షల అంశంపై కూడా స్పందిస్తూ, "బండి సంజయ్ కుటుంబ సభ్యులతో సహా ఎక్కడికైనా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. కేటీఆర్ సిద్ధమా?" అని ప్రశ్నించారు. కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ చేసిన కృషిని ప్రజలు గుర్తించారని, స్మార్ట్ సిటీ నిధులు తీసుకువచ్చి నగర అభివృద్ధికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. డంప్‌యార్డ్ సమస్యపై గత బీఆర్ఎస్ ప్ర



భుత్వ వైఫల్యాలను కూడా ఆయన ప్రస్తావించారు. బీజేపీ నాయకులు ఎవ్వరితోనూ కుమ్మక్కు రాజకీయాలు చేయరని, బండి సంజయ్‌పై చౌకబారు విమర్శలు చేస్తే తగిన రీతిలో ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు .ఈ సమావేశంలో 24వ డివిజన్ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ సాగాని కొమురయ్య, 43వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం మొండయ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, బీజేపీ నాయకుడు పండుగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- **కేటీఆర్ వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లే:**
- **ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణరావు**

**పెద్దపల్లి ప్రతినిధి మే 7 ప్రజా జ్యోతి;**

రూ.20 వేల కోట్ల రుణమాఫీతో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించింది హైదరాబాద్‌లోని సీఎల్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కాంగ్రెస్ ప్రభుత్వ రైతు సంక్షేమ చర్యలను వివరించారు. రైతుల సంక్షేమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, రైతు సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని విజయరమణరావు తెలిపారు. ఏకకాలంలో దాదాపు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేసి దేశంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. అయితే కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. గ్రామాలకు వెళ్లి రైతులను అడిగితే ప్రభుత్వ పనితీరు తెలుస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులను అయోమయంలోకి నెట్టే విధంగా పంటల విషయంలో ప్రకటనలు వచ్చాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తూ రైతులను ఆదుకుంటోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారం భరిస్తూనే మార్క్‌ఫెడ్ ద్వారా మక్కజొన్న కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తోందని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, కాంగ్రెస్‌పై బురదజల్లడమే బీఆర్ఎస్ పనిగా మారిందని విజయరమణరావు విమర్శించారు. రాష్ట్రంలోని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో



ఉన్నారని, బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా రైతాంగం కాంగ్రెస్ పార్టీ వెంటే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన ధాన్యానికి కోతలు విధించి నష్టపరిచారని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు మేలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు లింకేజీ లో పెద్దపల్లి జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు

**పెద్దపల్లి ప్రతినిధి మే 7 ప్రజా జ్యోతి;**

స్వశక్తి సంఘాల బ్యాంకింగ్ కేజీ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా అత్యున్నత ప్రతిభ కనబరిచినందుగాను రాష్ట్రంలో స్వశక్తిసంఘాల లింకేజీలో పెద్దపల్లి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అందుకుగాను గురువారం ఈ రోజు హైదరాబాద్ ప్రజా భవన్ లో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకు లింకేజీ అవార్డుల కార్యక్రమంలో పంచాయతీరాజ్ మరియుగ్రామీణ అభివృద్ధి శాఖామాత్యులు దనసరి సీతక్క గారి చేతుల మీదుగా అవార్డును ప్రధానం చేయడం జరిగింది. ఈ అవార్డును పెద్దపల్లి జిల్లా పక్షాన హాజరైన గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాలిందిని, అడిషనల్ డిఆర్డిఓ బి రవీందర్, డి పిఎం వెంకటరమణయ్య తోపాటు చైతన్య జ్యోతి జిల్లా సమాఖ్య కార్యదర్శి జె. శోభ అందుకున్నారు.

జిల్లాలో గత ఆర్థిక సంవత్సరం 2025 2026 కు గాను 7716 స్వయం సహాయక సంఘాలకు గాను 477.86 కోట్ల లక్ష్యాన్ని జిల్లాకు నిర్దేశించగా, అందుకుగాను 6851 స్వశక్తిసంఘాలకు 454.66 కోట్ల లక్ష్యాన్ని సాధించి రాష్ట్రస్థాయిలో స్వయం సహాయక సంఘాల కవరేజీలో మొదటి స్థానంలో నిలిచింది.

స్వ శక్తి సంఘాలకు బ్యాంకులు లింకేజి అందించి వారి ఆదాయ వృద్ధి మరింత మెరుగుపరచడానికి జిల్లాలోని సెర్ప్ సిబ్బంది అందరూ సమిష్టిగా కృషి చేసి సశక్తి సంఘాల లింకేజీలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపారు. అదేవిధంగా సంఘాల రీపేమెంట్ విషయంలో కూడా జిల్లా రాష్ట్రంలో కేవలం 0.85% ఎన్పీఏ ఉండడం వల్ల రిపేమెంట్లో కూడా అగ్రస్థానంలో నిలిచింది

అదేవిధంగా గత ఆర్థిక సంవత్సరంలోనే స్త్రీ నిధి మహిళా బ్యాంకు ద్వారా కూడా స్వ శక్తి సంఘాలకు పెద్ద ఎత్తున లోన్ లిపించడం మరి మరియు రికవరీ చేయడంలో కూడా పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రభాగాన నిలిచి స్త్రీనిధి జనరల్ బాడీ సమావేశంలో అవార్డులను అందుకోవడం జరిగింది.



సేర్ఫ్ సిబ్బంది అందరూ సమిష్టిగా ఇదే స్ఫూర్తితో పనిచేసి పెద్దపల్లి జిల్లాను అన్ని అంశాలలో అగ్ర భాగంగా నిలపాలని తెలిపారు. ఈ సందర్భంగా సెర్ప్ సిబ్బంది అందరిని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష గారు అభినందించారు.

# కరీంనగర్‌లో రాజకీయ రగడ

- దాడులు,ధ్వంసాలతో ఉద్రిక్తత
- గంగుల క్యాంప్ ఆఫీస్‌పై బీజేపీ దాడి
- బండి సంజయ్ కార్యాలయంపై బీఆర్ఎస్ ప్రతిదాడి
- ఇరు వర్గాలను అరెస్టు చేసిన పోలీసులు
- నాపై హత్యాయత్నం చేశారు,ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి






**కరీంనగర్ క్రైం,మే 07,ప్రజాజ్యోతి:**

కరీంనగర్ రాజకీయాలు ఒక్కసారిగా హీట్ ఎక్కాయి. ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలతో మొదలైన మాటల యుద్ధం చివరకు దాడులు, ధ్వంసాలకు దారితీసింది.కేటీఆర్‌పై డ్రగ్స్ ఆరోపణలు చేసిన బండి సంజయ్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా కౌంటర్ ఇవ్వడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.ఈ నేపథ్యంలో ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై గురువారం దాడికి దిగారు. కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును కూడా ధ్వంసం చేశారు.దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంపీ బండి సంజయ్ కార్యాలయంపై ప్రతిదాడికి దిగారు.సంఘటన స్థలాలకు భారీగా పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాల కార్యకర్తలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.దాడి అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. "బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి కలిసి పక్కా ప్లాన్‌తో నాపై హత్యాయత్నం చేయించారు. కొంతకాలంగా నాపై రెక్కీ జరుగుతోందని ముందే పోలీసులకు సమాచారం ఇచ్చాను" అని అన్నారు. "కర్రలతో దాడికి వచ్చారు" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ ఘటనతో కరీంనగర్‌లో రాజకీయ ఉద్రిక్తత మరింత పెరిగింది. నగరంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, దాడులకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి,

## అన్ లోడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- ఇల్లంతకుంట మండలంలోని కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో తనిఖీ

**ఇల్లంతకుంట, మే7(ప్రజాజ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంట వెంటనే అన్‌లోడింగ్ చేయించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.మండలంలోని పెద్దలింగాపూర్,అనంతారంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గురువారం పరిశీలించారు. ధాన్యం రాశులు, కొనుగోలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హమాలీల సంఖ్యను పెంచాలిరైస్ మిల్లర్లు తమ మిల్లుల్లో హమాలీల సంఖ్యను పెంచి కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం లారీలను అన్ లోడింగ్ చేయించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం చింతలకుంటపల్లి లోని లక్ష్మీ సాయి రైస్ మిల్లు, తాళ్లపల్లి లోని రాజ రాజేశ్వర రైస్ ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ లోడింగ్, హమాలీల సంఖ్య పెంపు తదితర అంశాలపై మిల్లర్లకు పలు సూచనలు చేశారు.



## మే 11 నుండి 17 వరకు జిల్లాలో విద్యా వారోత్సవాలు: జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద

**పెద్దపల్లి, ప్రతినిధి మే 07 ప్రజా జ్యోతి:**



పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మే 11 నుండి 17 వరకు ఎడ్యుకేషన్ వీక్ (విద్యా వారోత్సవాలు) ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడానికి, పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు.

**వారోత్సవాల వారీగా నిర్వహించే కార్యక్రమాలు వివరాలు...**

మే 11 (మొదటి రోజు): ఫౌండేషన్ డే & సమ్మర్ క్యాంపులు ఎంపిక చేసిన PM SHRI పాఠశాలల్లో సమ్మర్ క్యాంపుల ప్రారంభం.మే 12 (రెండవ రోజు): SSC రెమెడియల్ క్యాంపులు పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు.
మే 13 (మూడవ రోజు): సర్పంచుల సదస్సు పాఠశాలల అభివృద్ధిపై స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం.మే 14 (నాల్గవ రోజు): ఆయకట్ట బడి బాట & PTM
తల్లిదండ్రుల సమావేశాలు, కొత్త అడ్మిషన్ల నమోదు.
మే 15 (ఐదవ రోజు): లైబ్రరీ డే "లైబ్రరీస్: ది హార్ట్ ఆఫ్ నాలెడ్జ్" పేరుతో పుస్తక ప్రదర్శనలు, రీడింగ్ క్లబ్ల ఏర్పాటు.
మే 16 (ఆరవ రోజు): ఆర్ట్స్, క్రాఫ్ట్స్ ,కల్చరల్ డే విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, బొమ్మల తయారీ పోటీలు.
మే 17 (ఏడవ రోజు): విద్యా విజయోత్సవం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉత్తమ పాఠశాలలకు బహుమతుల ప్రధానోత్సవం. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంటేషన్ వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి పంపాలని ప్రధానోపాధ్యాయులకు డీఈఓ సూచించారు. ఈ విద్యా వారోత్సవాల్లో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ నగేష్

**గంగాధర మే 07: (ప్రజా జ్యోతి):**



మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో ఉపాధి హామీ కూలీలు 108 మందికి సర్పంచ్ ముద్దం నగేష్ ప్రతి రోజూ తన సొంత ఖర్చుతో మజ్జిగ, మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యం లో కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఉండటానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు నగేష్ తెలిపారు. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కూలీలకు సూచించారు.

## 102 ఏళ్ల బామ్మకు శస్త్రచికిత్స విజయవంతం

- డాక్టర్ వివేకానంద
- యశోద హాస్పిటల్ సోమాజిగూడ వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ వివేకానంద భీమిశెట్టి.

**కరీంనగర్ టౌన్ మే 7 (ప్రజా జ్యోతి )**



వయసుతో సంబంధం లేకుండా వృద్ధులకు సరైన సమయంలో నిపుణుల పర్యవేక్షణలో వైద్యం అందిస్తే వారు మళ్లీ సాధారణ జీవితం గడపవచ్చని ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ వివేకానంద భీమిశెట్టి అన్నారు. గురువారం నగరంలోని యశోద హాస్పిటల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన 102 ఏళ్ల వృద్ధురాలికి నడుము శస్త్రచికిత్స విజయవంతం చేసిన సందర్భంగా నగరంలోని యశోద ఆసుపత్రిలో ఆయన వివరాలు వెల్లడించారు. కుడి నడుము భాగం విరిగి (ఐటీ ఫ్రాక్చర్) తీవ్ర గాయంతో హాస్పిటల్లో చేరిన బామ్మకు, వృద్ధాప్య సమస్యలు ఉన్నప్పటికీ సవాలుగా తీసుకుని సర్జరీ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ జరిగిన మరుసటి రోజే ఆమెను నడిపించామని, రెండు వారాల్లోనే ఆమె కోలుకుని తన పనులు తాను చేసుకునే స్థాయికి చేరుకున్నారని వివరించారు. సరైన చికిత్స తోడైతే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని ఈ ఘటన నిరూపించిందన్నారు. ప్రస్తుతం బామ్మ స్వగ్రామంలో పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని డాక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్ సుధీర్ రెడ్డి శ్రావణ్ పాల్గొన్నారు.

## అగ్రహారం జోడాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేకపూజలు చేసిన కరీంనగర్ జిల్లా వికలాంగుల అధ్యక్షులు ఓదెల నరేష్

**గంగాధర మే 07: (ప్రజా జ్యోతి):**



తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా మేర కుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకట్ రాజం వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ ఎన్నికైనందున వారిద్దరి పేర్ల మీద ప్రత్యేక పూజలు చేసిన వికలాంగుడు ఓదెల నరేష్ మాది కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన నిరుపేద మధ్య తరగతి కుటుంబానికి చెందిన వికలాంగుడు ఓదెల నరేష్ డిగ్రీ&ఐటిఐ చదువుకున్నాడు గురువారం రోజున వారి మీద ప్రేమాభిమానంతో అగ్రహారం జోడాంజనేయస్వామి దేవస్థానంలో చైర్మన్ వైస్ చైర్మన్ గారి పేర్ల మీద ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఇంకా రానున్న రోజుల్లో మంచి పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోనే వికలాంగుల దాంట్లో ఎంతో కష్టపడి అరెస్టయి జైలు పాలై అయినా ప్రభుత్వం ఏనాడు గుర్తించలేదు ఇప్పుడు ఉన్న ప్రభుత్వం తరుపున మా కులానికి చైర్మన్ వైస్ చైర్మన్ ఉన్నందున వికలాంగుడు ఓదెల నరేష్ ని గుర్తించాలని మన మేరు సంఘంలో పెద్దలందరికీ వికలాంగుడు ఓదెల నరేష్ పడే బాధలు అందరికీ తెలిసిన విషయమే కానీ చైర్మన్ వైస్ చైర్మన్ గారు తక్షణమే స్పందించి ముఖ్యమంత్రి దిష్టికి మంత్రుల దిష్టికి తీసుకెళ్లి నా సమస్యలు మీరు పట్టించుకోవాలని మీ ద్వారా నాకు ఒక మంచి ఉద్యోగం రావాలని తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం పక్షాన మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

## కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం సిద్ధం వేణు మాజీ జెడ్ పీ టి సి

- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి
- కరీంనగర్ ఘటనతో బీజేపీ అసలు స్వభావం బయటపడింది
- విమర్శలు తట్టుకోలేక బీజేపీ నాయకత్వం దాడులకు దిగుతోంది
- బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలి దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

**ఇల్లంతాకుంట మే 7(ప్రజజ్యోతి)**

కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బండి సంజయ్ అనుచరులు చేసిన దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతి నిధుల క్యాంపు కార్యాలయాలపైనే బీజేపీ గూండాలు దాడులకు తెగ బడటం రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పడానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో మాటకు మాటతో సమాధానం చెప్పాలి గానీ, దాడులు చేసి విధ్వంసానికి పాల్పడటం బీజేపీ అసలు స్వభావాన్ని బయటపెడు తోందని విమర్శించారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతిని ధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే ఇలాంటి అరాచకాలు జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన వారే మౌనంగా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో విధ్వంసం సృష్టించడం, కారు అద్దాలు పగు లగొట్టడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూపిస్తోందన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడి ఒక వ్యక్తి పై దాడి మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యంపై దాడి అని సిద్ధం వేణు పేర్కొన్నారు. ఇంకా బాధాకరం ఏమిటంటే మొత్తం ఘటనలో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తూ దాడి చేసేవారికే సహకరిస్తున్నట్టుగా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన వారే మౌనంగా ఉండ టం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే హక్కు ఉంది. కానీ బీజేపీ నాయకులు మాత్రం తమపై విమర్శ వస్తే భయపెట్టి దాడులు చేసి నోరు మూయించాలని చూస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమన్నారు. ఇలాంటి అహంకార, అరాచక రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ సహించరన్నారు. బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలి..ఈ దాడికి పాల్పడిన వారి ని వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అవసరమైతే ప్రజలే వీధు ల్లోకి వచ్చి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు..



## మోదీ సభ విజయవంతానికి ప్రతి బూత్ నుంచి భారీగా తరలిరావాలి

- బిజెపి పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజ్

**సుల్తానాబాద్, మే 7: (ప్రజా జ్యోతి)**



సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సుల్తానాబాద్ బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి బూత్ స్థాయిలో సమన్వయం చేసుకుని కార్యకర్తలు, ప్రజలను పెద్దఎత్తున సమీకరించాలని నిర్ణయించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అధ్యక్షతనన గురువారం నిర్వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, ప్రజలతో మరింత అనుబంధం పెంపొందించే అంశాలపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి సూచనలతో ప్రతి నెల మొదటి వారంలో పట్టణ కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వస్తున్న నేపథ్యంలో ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. రూ.7 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్న ఈ సభకు సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు, బూత్‌ల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మోర్చాల సభ్యులు, యువత, మహిళలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి బీజేపీని మరింత బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి కామని రాజేంద్ర ప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు కొమ్ము తిరుపతి యాదవ్, మాజీ సర్పంచ్ లంక శంకర్, వాణిజ్య సెల్ కన్వీనర్ ఎల్లంకి రాజన్న, ఎనగందుల ఎల్లయ్య, బీజేపీ కౌన్సిలర్ కందునూరి సమత కుమార్, ప్రధాన కార్యదర్శి గుడ్ల వెంకటేష్, ఉపాధ్యక్షులు గజభింకర్ పవన్, బూసరపు సంపత్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు చిట్టవేణి సదయ్య, కోశాధికారి రామిడి రవీందర్, దళిత మోర్చా అధ్యక్షుడు ఇనుగుల శ్రీనివాస్, కావేటి లచ్చన్న, పోచంపల్లి ఈశ్వర్, చింటూ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడిని ఖండిస్తున్నాం

- మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎలా శేఖర్

**తిమ్మాపూర్ మే 7 (ప్రజాజ్యోతి)**



కౌశిక్ రెడ్డి కారుపై జరిగిన దాడి అలాగే కరీంనగర్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడులను మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎలా శేఖర్ బాబు తీవ్రంగా ఖండించారు.రాజకీయాల్లో సిద్ధాంతాలతో ఎదుర్కోలేక బీజేపీ నాయకులు బెదిరింపుల రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రోత్సాహంతోనే కరీంనగర్‌లో బీజేపీ కార్యకర్తలు ఉద్రిక్త పరిస్థితులు సృష్టిస్తూ హింసాత్మక రాజకీయాలకు తెరలేపుతున్నారు,కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ శాంతి భద్రతలను కాపాడాల్సింది పోయి తన అనుచరులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని ఎలా శేఖర్ బాబు అన్నారు. కరీంనగర్‌ను రాజకీయ ఉద్రిక్తతల కేంద్రంగా మార్చే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఇలాంటి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జగిత్యాల సహకార సంఘ (PACS) పాలకవర్గం బాధ్యతల స్వీకరణ...

- రైతు సేవయే లక్ష్యంగా పనిచేస్తాం: సంఘ అధ్యక్షులు పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి.

**జగిత్యాల టౌన్,మే7 (ప్రజాజ్యోతి):**




జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) పాలకవర్గం గురువారం కొలువుదీరింది. గతంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని పాలకవర్గాలను రద్దు చేయగా, హైకోర్టు ఆదేశాలు మరియు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాలకవర్గ సభ్యులు ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు శ్రీ పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ, వారికి అవసరమైన సేవలను సకాలంలో అందిస్తామని, సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుల గంగారాం శంకరయ్య,తోట గంగరాజాం, అల్లాల రమేష్ రావు,బేతి రాజవ్వ,నిలం లక్ష్మి, ఏలేటి రాజిరెడ్డి,సంఘ కార్యదర్శి గాజేంగి వేణు, ఇతర కార్యాలయ సిబ్బంది మరియు సభ్యులు పాల్గొన్నారు. పాలకవర్గ బాధ్యతల స్వీకరణ పట్ల రైతులు, స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## సుల్తానాబాద్ పట్టణ బీజేపీ దళిత మోర్చా అధ్యక్షునిగా ఇనుగాల శ్రీనివాస్ నియామకం

**సుల్తానాబాద్, మే 7 : (ప్రజా జ్యోతి)**

భారతీయ జనతా పార్టీ సుల్తానాబాద్ పట్టణ దళిత మోర్చా అధ్యక్షునిగా ఇనుగాల శ్రీనివాస్ నియమితులయ్యారు. గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇనుగాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ్, ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు, ఉపాధ్యక్షుడు సౌదరి మహేందర్, మాజీ దళిత మోర్చా అధ్యక్షుడు లంక శంకర్‌తో పాటు పార్టీకి చెందిన జిల్లా, మండల, పట్టణ స్థాయి నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలియజేసిన ఆయన.. దళిత వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా పనిచేస్తానని పేర్కొన్నారు. అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి నాయకత్వం అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఇనుగాల శ్రీనివాస్ నియామకంపై బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.





## కల్వకోటలో ఘనంగా దుర్గమ్మ బోనాలు

**మేడిపల్లి, మే 7(ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామంలో దుర్గమ్మ బోనాల పండుగ గురువారం రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు నూతన వస్త్రాలు ధరించి, నెత్తిమీద బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి దుర్గమ్మ ఆలయంలో బోనాలు సమర్పించారు.భక్తులు మొక్కులు చెల్లించి, పంటలు చేతికొచ్చే సమయం కావడంతో వాతావరణం అనుకూలించాలని, పంటలు ఎలాంటి ఆటంకం లేకుండా సాఫీగా చేతికి రావాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దుర్గమ్మను ప్రార్థించారు.ఈ బోనాల పండుగ వైభవాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు .ఈ సందర్భంగా బోనాల ఊరేగింపును వీక్షించేందుకు వచ్చిన ప్రజలకు గ్రామ ఉపసర్పంచ్ ఆదే రవితేజ, వార్డు సభ్యురాలు చంద భూమక్క మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే ఆదే రవీందర్, ఎడ్ల వెంకట్, బన్న రాజేందర్ పులిహోర వితరణ చేశారు. గ్రామస్తుడు బొడ్డు మహేష్ చల్లటి త్రాగునీటిని అందించి సేవా కార్యక్రమాల్లో భాగమయ్యారు.అలాగే ఆలయ సమీపంలో రేకుల షెడ్డు నిర్మాణానికి నాగేల్లి మహేష్, కటకం మధు, రాచర్ల అరవింద్, తూమ్ అనిల్ ఆర్థిక సహకారంతో భూమి పూజ నిర్వహించారు. మొత్తంగా కల్వకోట గ్రామంలో దుర్గమ్మ బోనాల పండుగ అత్యంత వైభవంగా జరగడంతో గ్రామం భక్తి శోభతో కళకళలాడింది.

## భీమారం గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థి పల్లికొండ మహేష్‌కు పీహెచ్‌డీ పట్టా

**మీమారం, మే 7 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థి పల్లికొండ మహేష్ "వాతావరణ మార్పు ఉత్తర తెలంగాణ వ్యవసాయం పై దాని ప్రభావం " అనే అంశంపై విజయవంతంగా పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఈ పరిశోధనను ఆయన ప్రొఫెసర్ ఎ.వి. శశికళ పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయ రంగంపై ఎలా పడుతోందో, పంటల ఉత్పత్తి, వర్షపాతం మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి అంశాలను ఈ పరిశోధనలో సమగ్రంగా విశ్లేషించారు .ఈ పరిశోధన రైతులకు, వ్యవసాయ రంగ నిపుణులకు, విధాన నిర్ణేతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.పల్లికొండ మహేష్ సాధించిన ఈ ఘన విజయంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- **పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర.**
- **జగిత్యాల జిల్లాలో కలెక్టర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ..**

**జగిత్యాలప్రతినిధి,మే7(ప్రజాజ్యోతి):**



రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా సేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తొలుత పూడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, అక్కడ ఉన్న రైతులతో నేరుగా మాట్లాడారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూకంలో తేడాలు రాకుండా చూడాలని, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (MSP) అందేలా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ధాన్యంలోని తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మిల్ ట్యాగింగ్, రవాణాపై స్పష్టమైన ఆదేశాలు ధాన్యం సేకరణలో జాప్యాన్ని నివారించేందుకు మిల్ ట్యాగింగ్ (Mill Tagging) ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం నూకపెల్లిలోని గుణ గంగన్ రైస్ మిల్లును సందర్శించిన స్టీఫెన్ రవీంద్ర, అక్కడ ధాన్యం నిల్వ సామర్థ్యం మరియు మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా 'కస్టమ్ మిల్లింగ్ రైస్' (CMR) ను ప్రభుత్వానికి అప్పగించాలని మిల్లర్లకు హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం మరియు పౌర సరఫరాల శాఖ సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని సకాలంలో చేరుకోవాలని కోరారు. ఈ తనిఖీల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోరుట్లలో గర్ల్స్ జూనియర్ కాలేజీ పేరుతో మోసం?

- **ప్రభుత్వ అనుమతి లేకుండా అడ్మిషన్ల వల**
- **తల్లిదండ్రుల ఆందోళన**

**కోరుట్ల, మే 07 ప్రజాజ్యోతి**




కోరుట్ల పట్టణంలో విద్య రంగాన్ని కలవరపెడుతున్న ఒక సంచలన అంశం వెలుగులోకి వచ్చింది. ప్రైవేట్ జూనియర్ కళాశాల గర్ల్స్ జూనియర్ కాలేజీ పేరుతో తల్లిదండ్రులను ఆకర్షిస్తూ, ప్రభుత్వం నుండి ఎలాంటి అధికారిక అనుమతి లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్నాయనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఘటన విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది.

**తప్పుడు ప్రచారాలతో అడ్మిషన్ల వేట**

సమాచారం ప్రకారం, కోరుట్లలో ప్రైవేట్ జూనియర్ కళాశాల తమను ప్రత్యేకంగా బాలికల జూనియర్ కళాశాల గా పేర్కొంటూ ప్రచారం చేస్తున్నారు. పోస్టర్లు, బ్యానర్లు, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా గర్ల్స్ మాత్రమే అడ్మిషన్స్ అంటూ ప్రచారం చేసి, తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. కానీ వాస్తవానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి అలాంటి ప్రత్యేక గుర్తింపు లేదా అనుమతి లేనట్టుగా తెలుస్తోంది.

**తల్లిదండ్రుల విశ్వాసంతో ఆటలు**

తమ కుమార్తెల భద్రత, విద్యా నాణ్యత కోసం ప్రత్యేకంగా గర్ల్స్ కాలేజీని ఎంపిక చేయాలని భావించే తల్లిదండ్రులు ఈ ప్రకటనలకు ఆకర్షితులవుతున్నారు. కానీ తరువాత అసలు పరిస్థితి తెలుసుకుని మోసపోయామని భావిస్తున్న సంఘటనలు బయటకు వస్తున్నాయి.గర్ల్స్ కాలేజీ అని చెప్పి అడ్మిషన్ తీసుకున్నారు... ఇప్పుడు అది సాధారణ కాలేజీ అని తెలిసింది అని కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సర్టిఫికెట్లలో నిజం బయటపడాల్సిందే**

విద్యార్థులు సెకండ్ ఇయర్ పూర్తి చేసిన తరువాత ఇచ్చే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ మరియు స్టడీ సర్టిఫికెట్ లో కాలేజీ పేరు ఎలా నమోదవుతుందన్నది కీలక అంశంగా మారింది.తల్లిదండ్రులు స్పష్టంగా చెబుతున్నారువాస్తవంగా అది గర్ల్స్ జూనియర్ కాలేజీ అయితే, సర్టిఫికెట్‌లో బాలికల జూనియర్ కళాశాల అని స్పష్టంగా ఉండాలి అలా లేకపోతే అది తప్పుడు ప్రచారం అని భావించాలిఈ అంశం ద్వారా అసలు నిజం బయటపడే అవకాశముందని భావిస్తున్నారు.

**విద్యాశాఖ పాత్రపై ప్రశ్నలు**

ఈ ఘటనపై స్థానిక ప్రజలు మరియు తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**అనుమతి లేకుండా ఇలాంటి ప్రచారం ఎలా జరుగుతోంది?**

సంబంధిత అధికారులు తనిఖీలు చేయడంలో విఫలమయ్యారా?విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఈ చర్యలపై ఎందుకు వెంటనే స్పందించడం లేదు?అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిజానిజాలు బయటపెట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజల డిమాండ్లు కఠిన చర్యలు అవసరం**

స్థానికంగా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు తప్పుడు ప్రచారం చేసే కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి విద్యార్థులకు నష్టం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి బాధిత తల్లిదండ్రులకు న్యాయం చేయాలి

**నిపుణుల సూచనలు అడ్మిషన్ ముందు తప్పక చెక్ చేయండి**

ద్యా నిపుణులు తల్లిదండ్రులకు కీలక సూచనలు చేస్తున్నారు కాలేజీకి ప్రభుత్వం గుర్తింపు ఉందో లేదో పరిశీలించండి అధికారిక వెబ్‌సైట్ లేదా విద్యాశాఖ ద్వారా ధృవీకరించండికాలేజీ ఇచ్చే బ్రోషర్లు మాత్రమే నమ్మకండి

**సీనియర్ విద్యార్థులు, స్థానికుల అభిప్రాయాలు తెలుసుకోండి**

విద్య రంగంలో మోసం భవిష్యత్తుపై ప్రభావం

విద్య అనేది ఒక కుటుంబానికి మాత్రమే కాదు, సమాజానికి కూడా అత్యంత కీలకం. అలాంటి రంగంలో మోసం చోటుచేసుకుంటే, అది విద్యార్థుల భవిష్యత్తును చీకటిలోకి నెట్టే ప్రమాదం ఉంది. కోరుట్లలో వెలుగులోకి వచ్చిన ఈ అంశం పై ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి, నిజానిజాలు బయటపెట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.తల్లిదండ్రులకు హెచ్చరిక ప్రచారాన్ని కాదు... నిజాన్ని నమ్మండి. మీ పిల్లల భవిష్యత్తు మీ జాగ్రత్తలపై ఆధారపడి ఉంది.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**కొడిమ్యాల, మే 07,(ప్రజాజ్యోతి):**

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని పూడూర్ గ్రామంలో పర్యటించిన ఆయన యాసంగి సీజన్‌కు సంబంధించిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తూకంలో తేడాలు లేకుండా చూడాలని, కనీస మద్దతు ధర రైతులకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్ ట్యాగింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్,అదనపు కలెక్టర్ బిఎస్ లత,ఆర్డీఓ మధుసూదన్ గౌడ్,ఎమ్మార్వో నరేష్,ఏఓ జ్యోతి,సర్పంచ్ కదారి మల్లేశం, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.







## బీర్ పూర్ లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' ఆధునిక సాగుపై అవగాహన

**బీర్ పూర్, మే7, ప్రజా జ్యోతి:**

బీర్ పూర్ మండల కేంద్రంలో గురువారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు', 'రైతువారం' మరియు 'వ్యవసాయ యాంత్రిక శక్తి' కార్యక్రమాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై శాస్త్రవేత్తలు మరియు అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కే. రామక్రిష్ణ మాట్లాడుతూ.. రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను ఎంచుకోవాలని సూచించారు. తక్కువ యూరియా వాడకం, ప్రకృతి వ్యవసాయం, పంటల మార్పిడి మరియు పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా పెట్టుబడి తగ్గించుకోవచ్చని వివరించారు. ముఖ్యంగా వరి కోసిన తర్వాత పంట అవశేషాలను కాల్చకుండా నేలలోనే కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని, కాలుష్యాన్ని నివారించవచ్చని ఆయన రైతులకు అవగాహన కల్పించారు.

**నేల ఆరోగ్యం - సన్న రక పంటలు:**

మండల వ్యవసాయ అధికారి తిరుపతి మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఫలితాలకు అనుగుణంగానే ఎరువులు వాడాలని కోరారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకం వరి వంగడాలైన బిపిటి 5204, ఆర్.ఎన్.ఆర్ 15048, కె.ఎన్.ఎమ్ 1638, జె.జి.ఎల్ 1798, జై శ్రీరామ్, హెచ్.ఎమ్.టి సోనా వంటి రకాలను సాగు చేయాలని సూచించారు. అలాగే నానో యూరియా, నానో డి.ఏ.పి వాడకం మరియు యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

**సబ్సిడీలు మరియు సంక్షేమం:**

వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న వివిధ రకాల యంత్రాల సబ్సిడీలు, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల గురించి అధికారులు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమితో పాటు రైతుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు శిరీష, వినోద్, రాజేష్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, లైన్మెన్లు, స్థానిక సర్పంచ్ హరీష్, ఉపసర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు మరియు క్లస్టర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## మేడిపల్లి లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మేడిపల్లి, (ప్రజా జ్యోతి):**

మేడిపల్లి మండల కేంద్రంలోని పి.ఎస్.ఆర్ గార్డెన్‌లో జెడ్పీహెచ్ఎస్ మేడిపల్లి 2006-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పాఠశాల విద్య, ఉపాధ్యాయుల కృషి ఎంతో దోహద పడిందని తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమ్మేళనంలో పాత జ్ఞాపకాలను పంచుకోవడంతో పాటు, భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మేడిపల్లిలో పోషణ్ పక్వాడ కార్యక్రమం

**మేడిపల్లి, మే7 (ప్రజా జ్యోతి):**

మేడిపల్లి గ్రామ రైతు వేదికలో సర్పంచ్ మకిలి దాసు అధ్యక్షతన, సీడీపీఓ మమత ఆధ్వర్యంలో 8వ పోషణ్ పక్వాడ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఆరోగ్యం, పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. గర్భధారణ నుంచి రెండేళ్ల వయస్సు వరకు మొదటి వెయ్యి రోజులు కీలకమని తెలిపారు. అనంతరం శ్రీమంతం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్వో మునీందర్, ఆర్ఐ ప్రవీణ్, ఉప సర్పంచ్ అర్జున్, వార్డు సభ్యులు, మహేష్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ధనలక్ష్మి, స్వప్న, శారద, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



## తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

**జగిత్యాల ప్రతినిధి,మే7(ప్రజాజ్యోతి):**

జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఎవరు కూడా అధైర్యపడవద్దని, కల్లాల్లో తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ రైతులకు భరోసా ఇచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల కలిగే నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం కుప్పలు తడవకుండా రైతులు, కేంద్రాల నిర్వాహకులు తక్షణమే టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలి. జిల్లాలో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్నందున పొలాల వద్ద ఉండే రైతులు అప్రమత్తంగా ఉండాలి. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద గానీ, విద్యుత్ స్తంభాల దగ్గర గానీ నిలబడవద్దని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.అకాల వర్షాల పట్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

**కొడిమ్యాల,మే 07,(ప్రజాజ్యోతి):**

మండలంలోని తురకకాశినగర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు గురువారం సర్పంచ్ సాదియ హుస్సేన్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు

**కొడిమ్యాల, మే 07,(ప్రజా-జ్యోతి):**



మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ బి.లావణ్య తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మెమో, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

## రైతు వేదికలో రైతు వారము కార్యక్రమం

**ఎండపల్లి, మే 7 ప్రజా జ్యోతి**

ప్రజాపాలన ప్రగతి , ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారం కార్యక్రమాన్ని గురువారం రోజున మండలంలోని గుల్లకోట రైతు వేదికలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. దీనిలో విద్యుత్ శాఖ,వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల వినియోగాన్ని పెంపొందించుకుని ఆర్థికంగా లాభపడాలని అన్నారు.విద్యుత్ ప్రమాదాల నివారణలో భద్రత, నియమాల ప్రాముఖ్యత పాటిస్తూ, జాగ్రత్తలు, విద్యుత్ సేవలపై రైతులకు అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా రైతులు అలాగే వినియోగదారుల కోసం రూపొందించిన విద్యుత్ భద్రత అవగాహన విద్యుత్ శాఖ పొలం బాట పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే మహేష్, సబ్ ఇంజనీర్ హరీష్, ఏఈ సమ్మయ్య, గుల్లకోట,చర్లపల్లి సర్పంచులు, గొల్లపల్లి మల్లేష్ గౌడ్, పడిధం లావణ్య మొగిలి వ్యవసాయ విస్తరణ అధికారిని లావణ్య,,లైన్ ఇన్స్పెక్టర్ ,లైన్ మెన్ లు, ఎ.ఎల్ ఎం విద్యుత్ సిబ్బంది, రైతులు,పాల్గొన్నారు,

